
సాక్షి ఒడిశా
సోమవారం । 22 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,92,940, బంగారం 900 మిల్లీగ్రాములు, వెండి 10 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.

మూడు రోజులకే..!

- చెట్టు కూలడంతో దెబ్బతిన్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్



- 8లో



డిమాండ్లు పరిష్కరించకుంటే.. ఆందోళనే

- 8లో

న్యూస్‌రీల్

కొరాపుట్ వైపు రైళ్లు రద్దు నేడు



కొరాపుట్ రైల్వేస్టేషన్

కొరాపుట్: కొత్తవలస-కిరండూల్ రైల్వే మార్గంలో 8 రైళ్లు రద్దయ్యాయి. సోమవారం ఈ మార్గంలో ఎస్.కోట-బొడ్డవరల మధ్య రెండో లైన్ నిర్మాణంలో భాగంగా మెగా బ్లాక్ చేయనున్నారు. ఈ కారణంగా విశాఖపట్నం-కిరండూల్(18514) ఎక్స్‌ప్రెస్, కిరండూల్-విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్, కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్, విశాఖపట్నం-రాయగడ-కొరాపుట్(18512) ఎక్స్‌ప్రెస్, కొరాపుట్-రాయగడ-విశాఖపట్నం(08511) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-కొరాపుట్(08546) పాసింజర్, కొరాపుట్-విశాఖపట్నం(08545) పాసింజర్ రైళ్లు రద్దు చేశారు. పలు రైళ్లు తిరుగు ప్రయాణం జరగాల్సి ఉన్నందున మంగళవారం కూడా రద్దు చేశారు.

రాష్ట్రంలో శాశ్వత పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు



భువనేశ్వర్: రాష్ట్రంలో శాశ్వత పోలీస్ భర్తీ బోర్డు(పీఆర్‌బీ) ఏర్పాటు ప్రతిపాదనకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా బోర్డు చైర్‌పర్సన్‌తో సహా ఇద్దరు సభ్యులు ఉంటారు. అంతేకాకుండా, బోర్డు కార్యాలయ నిర్వహణ కోసం 24 అడ్మినిస్ట్రేటివ్, ఇతర పోస్టులకు ప్రభుత్వం ఆమోదించినట్లు అధికారిక పత్రికా ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ప్రత్యేక డైరెక్టర్ జనరల్ లేదా అదనపు డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారిని బోర్డు చైర్‌పర్సన్‌గా నియమిస్తారు. ఇద్ద రు సభ్యులలో ఒకరు అదనపు డైరెక్టర్ జనరల్ లేదా ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ) స్థాయి అధికారి కాగా, మరొక సభ్యుడిగా డీఐజీ లేదా ఎస్పీ హోదాలో అధికారిని నియమిస్తారు. పోలీస్ విభాగంలో కానిస్టేబుల్ నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్లు వరకు మినిస్టీరియల్ సిబ్బంది నియామకాలు బోర్డు బాధ్యత వహిస్తుంది. ఈ పర్మినెంట్ బోర్డు ఏర్పాటుతో పోలీస్ డిపార్ట్‌మెంట్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియను క్రమబద్ధీకరిస్తారు.

'ఆధ్యాత్మిక భావనలు తప్పనిసరి'



మీడియా ప్రతినిధులను సత్కరిస్తున్న బీకే రీనా

రాయగడ: ప్రజా సేవల్లో తమ జీవితాలను అంకితం చేయాలంటే తప్పనిసరిగా ఆధ్యాత్మిక భావనలు కలిగి ఉండాలని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం జాతీయ విభాగం పాలనాధికారి రాజయోగిని రీనా తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్ ఓం శాంతి ఆర్ట్ గ్యాలరీ ప్రదర్శన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి వ్యక్తీ, అధికారి, నాయకులు వారి విలువలను గుర్తించుకోవాలన్నారు. ప్రజాహితం కోరే వారంతా సామాజిక సేవలో అంకితం కావాలని పిలుపునిచ్చారు. ప్రజా గొంతుకై, వారి సమస్యల పరిష్కారంలో ఎల్లవేళలా అంకిత భావంతో కృషి చేసే పాత్రికేయుల సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. నిరంతరం వారు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పాత్రికేయులు ప్రపంచానికి మంచి సందేశాలను అందించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ నిర్వహణలో ఎదుర్కొనే ఒత్తిడి, శ్రమ జయించాలంటే యోగా వంటివి నిరంతరం సాధన చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని మరో 6జిల్లాల్లో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. అనంతరం మీడియా ప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో మీడియా విభాగం జాతీయ పాలనాధికారి బీకే రాహుల్, రాయగడ ఇన్‌చార్జి బీకే శ్రీమతి తదితరులు ప్రసంగించారు.

పునర్వ్యవస్థీకరణకు వేళాయే..

- రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ నేడు
- కొత్త ముఖాలకు చోటు దక్కే అవకాశం
- మరికొందరికి ఉద్వాసన తప్పదంటున్న సీనియర్లు
- హాజరుకానున్న గవర్నర్ గణేషీలాల్, సీఎం నవీన్



గవర్నర్ గణేషీలాల్, సీఎం నవీన్ పట్నాయక్‌తో రాష్ట్ర మంత్రివర్గం (ఫైల్)



దీపాలి దాస్



విక్రమ్ పండా



లితికా ప్రధాన్

ప్రమాణ స్వీకారోత్సవ షెడ్యూల్

సమయం	కార్యక్రమం
9.30 గంటలు	ఎస్కార్ట్‌తో మంత్రులుగా నియమితులైన వారి రాక. రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆహ్వానం
9.40 గంటలు	ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆగమనం
9.45 గంటలు	గవర్నర్ గణేషీలాల్‌కు చీఫ్ సెక్రటరీ సాదర స్వాగతం
9.50 గంటలు	గవర్నర్ అనుమతితో ప్రమాణ స్వీకారోత్సవం ప్రారంభం. గవర్నర్ ఆధ్వర్యంలో పదవి, గోప్యతా ప్రమాణ స్వీకారం

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ఉదయం 9.50 గంటలకు స్థానిక లోక్ సేవా భవన్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రమాణ స్వీకారోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ కొత్త వారితో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఇద్దరు రాష్ట్ర మంత్రులు సమీర్ రంజనదాస్(పాఠశాలలు, సామూహిక విద్యావిభాగం), శ్రీకాంత్ సాహు(కార్మిక, ఉద్యోగుల బీమాశాఖ)లు గత వారం తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే జనవరి 29న రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి నవకిషోర్ దాస్ హత్య తర్వాత మరో స్థానం ఖాళీగా ఉంది. ఇలా మొత్తం 3 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. గతవారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ విక్రమ్‌కేశరి అరూఖ్ కూడా రాజీనామా చేయడంతో స్పీకర్ స్థానం భర్తీ చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా చివరి క్షణంలో మరో ఇద్దరు మంత్రులను రాజీనామా చేయించే అవకాశం ఉన్నట్లు ఊహాగానాలు జోరందుకున్నాయి. పలువురు సిట్టింగ్ మంత్రులకు పదవుల మార్పు చేర్పులు చోటు చేసుకునే అవకాశం కరిపిస్తోంది. వీరందరితో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. తన సొంత రాష్ట్రం హర్యానా పర్యటనలో ఉన్న గణేషీలాల్.. పర్యటనను అర్ధాంతరంగా ముగించుకుని ఒక రోజు ముందుగా ఆదివారం సాయంత్రం భువనేశ్వర్ చేరుకున్నారు.

రేసులో జూనియర్లు..

దివంగత మంత్రి నవకిషోర్ దాస్ కుమార్తె, ఝార్సుగుడ నియోజకవర్గం నుంచి కొత్తగా ఎన్నికైన దీపాలీ దాస్‌కు మంత్రి బెర్తు తథ్యమనే ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయి. పశ్చిమ ఒడిశాకు చెందిన సుశాంత సింగ్, శారదాప్రసాద్ నాయక్ పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. పూరీ, గంజాం జిల్లాలకు ఈసారి మంత్రి మండలిలో ప్రాతినిధ్యం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలిసారి ఎన్నికైన కవిసూర్యనగర్ ఎమ్మెల్యే లతికా ప్రధాన్, బరంపురం ఎమ్మెల్యే విక్రమ్‌పండా మంత్రి పదవుల ఆశావాదుల రేసులో ముందున్నారు. అలాగే సీనియర్ ఎమ్మెల్యే దేవీప్రసాద్ మిశ్రా, శశిభూషణ బెహరా, అమరప్రసాద్ శత్పతి, ప్రభుత్వ చీఫ్ విప్ ప్రశాంత ముదులి, ఉమాకాంత సామంతరాయ్ కూడా పోటీలో ఉన్నారు. సీనియర్ ఆశావాహుల్లో ఒకరిని స్పీకర్‌గా నియమించే అవకాశం కనిపిస్తోంది.

మాజీ పార్టీ బాధ్యతలు..!

వ్యక్తిగత కారణాలతో విక్రమకేశరి అరూఖ్ స్పీకర్ పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. అవకాశం కలిసి వస్తే మంత్రివర్గంలో చేరేందుకు సుముఖంగా ఉన్నారు. మరోవైపు, బిజూ జనతా దళ్(బీజేడీ) నాయకురాలిపై లైంగిక వేధింపుల ఆరోపణతో శ్రీకాంత్ సాహు, బిజూ జనతాదళ్ జిల్లా పరిషత్ సభ్యుడి ఆత్మహత్య కేసులో వివాదాస్పద సమీర్ రంజనదాస్ నుంచి అధిష్టానం రాజీనామా చేయించినట్లు సమాచారం. తెరవెనక వ్యవహారం ఇలా ఉండగా.. వీరివురికి 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్టీ సంస్థాగత బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం. ఇరివురి రాజీనామాతో రెవెన్యూ-విపత్తు నిర్వహణశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి ప్రమీలా మల్లిక్‌కు రాష్ట్ర పాఠశాలలు-సామూహిక విద్య, కార్మికశాఖ ఇన్‌చార్జి మంత్రిగా అదనపు బాధ్యతలను కేటాయించారు. నవకిషోర్ దాస్ హత్యతో ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖ బాధ్యతలను ఆర్థికమంత్రి నిరంజన్ పూజారి అదనంగా నిర్వహిస్తున్నారు.

ముగ్గురికి తీపి కబురు..

నవీన్ పట్నాయక్ మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణ పురస్కరించుకుని ముగ్గురు మాజీ మంత్రులకు కొలువులో చోటు కల్పించారు. వీరిలో విక్రమ్‌కేశరి అరూఖ్, సుదామ్ మరాండి, శారదాప్రసన్న నాయక్ ఉన్నారు. ఆదివారం సాయంత్రం వీరికి ఫోన్ ద్వారా ఈ శుభ సందేశం అందింది. వాస్తవాని నవీన్ మంత్రివర్గంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, పాఠశాలలు, సామూహిక విద్య, కార్మిక, బీమాశాఖలు ఖాళీగా ఉన్నాయి. ఈ శాఖలు వీరికి లభిస్తాయని భావిస్తున్నారు. ముగ్గురు ఎమ్మెల్యేలు తమ తమ ప్రాంతాల్లో సంస్థాగత అభివృద్ధి కార్యకలాపాల్లో విశేష కృషి చేసినట్లు అధిష్టానం గుర్తింపు సాధించి మంత్రి పదవులను సొంతం చేసుకోవడం విశేషం. వీరు గతంలో మంత్రులుగా పలు శాఖల్లో కీలకమైన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు.



విక్రమకేశరి అరూఖ్



సుదాం మరాండి



శారదా పి.నాయక్

రథయాత్రకు షెడ్యూల్ ఖరారు



సీఏఓ అధ్యక్షతన సమావేశమైన 36 నియోగుల సంఘం

- జూన్ 4న పూరీ జగన్నాథుని దేవస్నాన పూర్ణిమ
- 20న ఘోషయాత్రకు ముహూర్తం నిర్ణయించిన నియోగుల సంఘం

భువనేశ్వర్: ఈ ఏడాది జూన్ 4న పూరీ జగన్నాథునికి దేవస్నాన పూర్ణిమ, 20న ప్రపంచ ప్రసిద్ధ రథయాత్ర జరగనుంది. ఈ నేపథ్యంలో ఛొత్తీష్ నియోగుల సమావేశంలో ప్రధాన ఉత్సవాల షెడ్యూల్ ఖరారు చేశారు. ఘోషయాత్ర లేదా గుండిచాయాత్ర రోజు శ్రీమందిరం ప్రధాన ఆలయం రత్నవేదిక నుంచి చతుర్ధామూర్తుల తరలింపు(పాహొండి) ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 12:30 గంటలతో ముగించి మదన్మోహన్ విజే, అలంకరణ తదితర అనుబంధ కార్యక్రమాలు చేపడతారు. సాయంత్రం 4 గంటలకు రథాలు లాగడం ప్రారంభిస్తారు. దేవస్నాన పూర్ణిమ రోజు ఉదయం 9.30 నుంచి 11.30 మధ్య జలవిజే, పూజ, స్నానం కార్యక్రమాలు చేపట్టి మధ్యాహ్నం 12.45 గంటల నుంచి హత్తీ బేష్(గజానన అలంకరణ) ప్రారంభిస్తారు. నీలాద్రి భక్తి నివాస్ సమావేశ హాలులో శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ) రంజన్‌కుమార్ దాస్ అధ్యక్షతన ఆదివారం జరిగిన ఛొత్తీష్ నియోగుల సమావేశంలో సమావేశంలో పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ కె.విశాల్‌సింగ్, కలెక్టర్ ఇన్‌చార్జి ప్రదీప్‌కుమార్ సాహు, శ్రీమందిరం పాలకమండలి సభ్యులు, ఛొత్తీష్ నియోగుల సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి, సీనియర్ సేవాయత్‌లు పాల్గొన్నారు.

ప్రధాన ఉత్సవాల తేదీలివే..

తేదీ	ఉత్సవం
మే 30	రాజేంద్రాభిషేకం
మే 31	రుక్మిణీహరన్ ఏకాదశి
జూన్ 1	చంపక ద్వాదశి
జూన్ 2	దైతపతుల ప్రవేశం
జూన్ 3	సేనా పట్టా అమరిక
జూన్ 13	చౌక్కా విజే
జూన్ 14	ఖొల్లీ లగ్గి(విస్తరి సేవ)
జూన్ 15	రాజ్‌ప్రసాద్ విజే
జూన్ 16	ఘునా లగ్గి
జూన్ 17, 18	బొనొకొ లగ్గి
జూన్ 19	నేత్రోత్సవం, నవయవ్వన దర్శనం
జూన్ 24	హీరా పంచమి
జూన్ 25	రథాల దక్షిణ మలుపు
జూన్ 27	సంధ్యా దర్శనం
జూన్ 28	బహుదా యాత్ర (మారు రథయాత్ర)
జూన్ 29	స్వర్ణ అలంకరణ
జూన్ 30	ఒధొరొ పొణా
జూలై 1	నీలాద్రి విజే

గజపతి జిల్లాలో ఈదురుగాలులు



సిద్ధమణుగులో ఇంటిపై విరిగి పడిన చెట్టు

పర్లాకిమిడి: కాలవైశాఖి ప్రభావంతో గజపతి జిల్లాలోని కాశీనగర్, పర్లాకిమిడి తదితర ప్రాంతాలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రాణిపేట పంచాయతీ సిద్ధమణుగలో ఆరు ఇళ్లపై చెట్లు నేలకొరగడంతో రేకులు విరిగిపోయాయి. రాణిపేట జంక్షన్ నుంచి సిద్ధమణుగు, హడ్డుబంగి మధ్య విద్యుత్ స్తంభాలు, చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పర్లాకిమిడిలో గాలివానకు విద్యుత్ తీగలు నేలకొరిగాయి. రాత్రి వరకు సరఫరా పుణరుద్ధరించలేదు. దీంతో పట్టణంలోని పలు కూడళ్లలో జరుగుతున్న అమ్మవారి సంబరాలకు ఆటంకం ఏర్పడింది.



రాణిపేట పంచాయతీలో కురుస్తున్న వర్షం

రాజీవ్‌గాంధీకి నివాళులు

కొరాపుట్: భారత 7వ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్‌గాంధీ వర్ధంతి నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ పార్క్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. రాజీవ్ బలిదానం జాతి మరువదని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నిమయ్ సర్కార్, కొరాపుట్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ భగవాన్ బాహినీపతి, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ ఆర్గనేజేషన్ కన్వీనర్ రుపక్ తురుక్, రమేష్ ఖొరా, కిరణ్ తురుక్ తదితరులు పాల్గొన్నారు.



కొరాపుట్: రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా ప్రణయ్ శర్మ

జయపురం: నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్‌ఎస్‌యూఐ) కొరాపుట్ జిల్లాశాఖ అధ్యక్షుడిగా ప్రణయ్ శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్‌ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి, ఒడిశా రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ ఇన్‌చార్జి అణులేఖ బూస ఆదివారం ప్రకటన విడుదల చేశారని సంఘం ఒడిశా శాఖ అధ్యక్షుడు యశీర్ నవాజ్ తెలిపారు.

మైనర్ సహా ముగ్గురి అరెస్ట్

- చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- ఆభరణాలు, చోరీ సొత్తు రికవరీ



పోలీసుల అదుపులో నిందితులు



స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

జయపురం: స్థానిక పట్టణంలోని గోపబంధు నగర్ మందిరం, ఓ ఇంట్లో విలువైన ఆభరణాలు ఎత్తుకుపోయిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి సంబిత్‌కుమార్ జెనా తెలిపారు. వీరిలో ఒకరు మైనర్ కాగా, మిగతా ఇద్దరూ స్థానిక ఒడియా మేదర వీధికి చెందిన హరి నాయక్(20), విశాల నాయక్ అలియాస్ బాబు(19)గా గుర్తించారు. నిందిదుల నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకోగా, మైనర్‌ను జువైనల్ హోమ్‌కు తరలించినట్లు వెల్లడించారు. వివరాలు పరిశీలిస్తూ.. ఈనెల 10న జయపురం గోపబంధు నగర్ లోని బంగారుణి మందిరం తోపాటు సమీపంలోని మరోఉ ఇంట్లో చోరీ జరిగింది. దుండగులు అమ్మవారి కిరీటం, ఆభరణాలతో పాటు హుండీని ఎత్తుకు పోయారు. అలాగే ఈనెల 13న అదే ప్రాంతంలోని కేదార్‌దాస్ అనే వ్యక్తి ఇంట్లో బంగారు నగలు, ఖరీదైన వస్తువులు అపహరణకు గురయ్యాయి. ఈ రెండు ఘటనలపై వేర్వేరుగా ఫిర్యాదులు నమోదయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎస్‌ఐ సిద్ధాంతకుమార్ బెహరా, ఏఎస్‌ఐ బిష్ణ మడకామి ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. 2 ఘటనల్లో పాలుపంచుకున్న వారు ఒకరేనని గుర్తించడంతో పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ మేరకు కేసులో ముగ్గురి ప్రమేయం ఉన్నట్లు గుర్తించి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వీటిలో అమ్మవారి కిరీటం, ఆభరణాలు లభ్యం కాగా.. హుండీలోని రూ.600లు ఖర్చు చేసినట్లు నిందితులు అంగీకరించారు.

ఖగోళ వింత.. కనువిందు

- భువనేశ్వర్‌లో జీరో షాడో డే
- నేడు కటక్ నగరంలో ఏర్పడే అవకాశం



భువనేశ్వర్‌లో శూన్య నీడ ప్రత్యక్ష దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్ర రాజధాని నగరంలో ఆదివారం అరుదైన ఖగోళ దృశ్యం ఆవిష్కృతమైంది. ఉదయం 11.43 గంటలకు శూన్య నీడ(జీరో షాడో) తారసపడింది. ఈ సమయంలో ఒక వస్తువు లేదా జీవి నీడ కనిపించదు. ఈ దృశ్యం స్వల్పంగా 3 నిముషాలు కొనసాగింది. సూర్యుడు అత్యున్నత స్థానానికి చేరుకోవడం వల్ల నీడ నేరుగా వస్తువు కింద ఉందని భువనేశ్వర్ ప్లానిటోరియం అధికారి తెలిపారు. దాదాపు 3 నిమిషాల క్లుప్త కాలం ఇది కొనసాగింది. ఈ కార్యక్రమానికి స్థానిక పఠాని సామంత ప్లానిటోరియంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. కాల వ్యవధిలో ఏదైనా నిలువు వస్తువు నీడ ఆ క్షణంలో అదృశ్యమవుతుంది. జీరో షాడో డే ఒక నిర్దిష్ట ప్రదేశంలో సంవత్సరానికి రెండు సార్లు జరుగుతుందని పఠాని సామంత ప్లానిటోరియం డిప్యూటీ డైరెక్టర్ శువేందు పట్నాయక్ తెలిపారు. కటక్ నగరంలో ఈనెల 22న ఉదయం 11.30 గంటలకు వాతావరణ పరిస్థితుల ఆధారంగా జీరో షాడో తారస పడుతుందని ఆయన వెల్లడించారు. ఇలా సంవత్సరానికి రెండు సార్లు సంభవిస్తుందన్నారు. సూర్యుడు కర్కాటక, మకర రాశుల మధ్య నెలకొని ఆకాశంలో నడినెత్తిన ఉన్న అన్ని ప్రాంతాల్లో సూర్య కిరణాలు భూమి ఉపరితలంపై లంబంగా పడటానికి దారితీస్తుందని పేర్కొన్నారు. భానుడు సరిగ్గా తలపై ఉన్నందున.. ఏ జీవి లేదా వస్తువు నీడ తారసపడక పోవడంతో ఫలితంగా జీరో షాడో ఏర్పడుతుందని స్పష్టంచేశారు. ఉత్తరాయణం(శీతాకాలపు అయనాంతం నుంచి వేసవికాలం వరకు దక్షిణం నుంచి ఉత్తరానికి సూర్యుని కదలిక), అలాగే దక్షిణాయణం(ఉత్తరం నుంచి దక్షిణానికి తిరిగి) సంభవిస్తుందని గుర్తుచేశారు. భూమి భ్రమణ అక్షం సూర్య భ్రమణం అక్షానికి దాదాపు 23.5 డిగ్రీల కోణంలో వాలి ఉంటుందన్నారు. సూర్యుని స్థానం భూమి, భూ మధ్యరేఖ ఉత్తరాన 23.5 డిగ్రీలు నుంచి దక్షిణం వైపు 23.5 డిగ్రీల మధ్య కదులుతుందని వివరించారు. ఈ భ్రమణం ఉన్న అన్ని ప్రదేశాల్లో మధ్యాహ్న సమయంలో ఒక వస్తువు కింద నీడతో శూన్య నీడ చవి చూస్తాయని సువేందు పట్నాయక్ ప్రకటించారు.

క్లుప్తంగా

ఆటో ఢీకొని వృద్ధునికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలపాలైన మల్లయ్య

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అయోధ్యపురం గ్రామానికి చెందిన ఎం.మల్లయ్య అనే వృద్ధునికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మల్లయ్య ఆదివారం ఉదయం తన సైకిల్ మీద టెక్కలి వైపు వస్తుండగా అదేమార్గంలో వచ్చిన లగేజీ ఆటో ఢీకొట్టింది. దీంతో మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



అదుపు తప్పి బోల్తా పడిన వ్యాన్

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట గ్రామ సమీప జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున మామిడి కాయల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా రఘుల్ మెట్ట గ్రామానికి చెందిన డ్రైవర్ భగవాన్ సాయి తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

టైరు పేలి.. అదుపు తప్పి



రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన కంటైనర్ లారీ ముందు భాగం

కోటబొమ్మాళి: మండలంలోని జర్జంగి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం కంటైనర్ లారీ అదుపు తప్పి మరో లారీని ఢీకొట్టింది. ఘటనలో ఒడిశాకు చెందిన లారీ డ్రైవర్ ప్రదీప్‌కుమార్ ప్రధాన్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా నుంచి చేపల లోడుతో విశాఖపట్నం వెళ్తున్న కంటైనర్ లారీ జర్జంగి వద్దకు వచ్చే సరికి టైరు పేలడంతో అదుపు తప్పి జాతీయ రహదారిపై నున్న మరో లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో లారీ ముందు భాగం ధ్వంసమవ్వగా లారీ డ్రైవర్ కుడికాలు విరిగిపోయింది. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో కోటబొమ్మాళి ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడి నుంచి విశాఖ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

అపూర్వ సాయం



కిడ్నీవ్యాధికి గురైన స్నేహితులను దత్తత తీసుకున్న పూర్వ విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: పాఠశాల పూర్వ విద్యార్థులు చాలా కాలం తర్వాత కలుసుకోవడం, ఆటపాటలతో పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడం అందరూ చూసేదే. కానీ బొడ్డపాడు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2003 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఓ అపూర్వ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వీరు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులకు సత్కరించారు. ఆ తర్వాత తమ స్నేహితులైన మద్దిల అర్జున్, బైనపల్లి గీతలు ఇద్దరూ కిడ్నీ వ్యాధులకు గురి కావడంతో వారికి తక్షణ సాయం కింద రూ.10 వేల చొప్పున అందజేసి, ఎప్పుడు ఎలాంటి సాయం కావాలన్నా చేస్తామంటూ దత్తత తీసుకున్నారు. వీరిని ఉపాధ్యాయులు మెచ్చుకున్నారు.

మూడు రోజులకే..!



ధ్వంసమైన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ముందుభాగం

- కాలవైశాఖితో దెబ్బతిన్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్
- చెట్టు కూలడంతో పగిలిన లోకో అద్దాలు
- ఏసీ మొరాయించడంతో ప్రయాణికుల ఉక్కిరిబిక్కిరి

భువనేశ్వర్: రయ్.. రయ్‌మని దూసుకు పోవాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్(22896) రైలు.. ప్రారంభించిన మూడు రోజులకే పట్టాలపై నడి మార్గంలో నిలిచిపోయింది. పూరీ నుంచి ఆదివారం మధ్యాహ్నం 1.50 గంటలకు హౌరాకు బయలుదేరిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ మార్గం మధ్యంలో కాలవైశాఖి తీవ్రతకు గురైంది. జాజ్‌పూర్ జిల్లా బైతరణి రోడ్డు సమీపంలో కాలవైశాఖి తీవ్రతతో చెట్టు కూలడంతో రైలు లోకోపైలెట్ ముందు అద్దం పగిలిందని తూర్పుకోస్తా రైల్వే వర్గాలు వెల్లడించాయి. ఆదివారం సాయంత్రం 4.35 గంటల నుంచి రైలు నిలిచిపోయింది. ఈ విపత్తుతో రైలులో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుద్దీపాలు, ఏసీ సౌకర్యానికి గండిపడింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 18న(గురువారం) మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వందేభారత్‌ను జెండా ఊపి ప్రారంభించిన విషయం తెలిసిందే. దీంతో వేగవంతమైన సుఖమయ ప్రయాణం ఈ రైలు కల్పిస్తుందని ప్రకటించారు. ముచ్చటగా మూడో రోజుల్లో అవాంఛనీయ ఘటన చోటు చేసుకోవడం విచారకరం.



పగిలిన లోకో అద్దాలు

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ..

పూరీ నుంచి హౌరా బయల్దేరిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు బైతరణి రోడ్, మంజురి రోడ్ మధ్య విపత్తుకు గురైంది. ఆదివారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. రైల్వే యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ కార్యకలాపాలు చేపట్టింది. తూర్పుకోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండలం భద్రక్ రైల్వేస్టేషన్ సమీపంలో కాలవైశాఖి తీవ్రతతో ఈ రైలు ఓవర్ హెడ్ వైర్ దెబ్బతిన్న కారణంగా వంతెన మధ్యలో చిక్కుకుంది. ట్రాక్‌పై వేళ్లాడిన చెట్టు పడిపోవడంతో ఈ పరిస్థితి తాండవించినట్లు తూర్పుకోస్తా రైల్వే వర్గాల సమాచారం. రాత్రి 7.30 గంటల సరికి రైలు రవాణా పునరుద్ధరణ ఊహించినా సాధ్యం కాలేదు. ఇంజిన్ పాంటోగ్రాఫ్ ఓవర్ హెడ్ వైర్‌తో చిక్కుకుంది. సాయంత్రం 6.20 గంటల ప్రాంతంలో బైతరణి రోడ్, మంజురి రోడ్ మధ్య అప్‌లైన్ ఓవర్‌హెడ్ వైర్ పరికరాలు సరిచేశారు.

డీజిల్ ఇంజిన్ సాయంతో..

అనంతరం డీజిల్ ఇంజిన్ సాయంతో ఘటనా స్థలం నుంచి వందేభారత్ రైలును మంజురి రోడ్డు వరకు నడిపించారు. రాత్రి 8.17 గంటలకు ఖుర్దారోడ్‌కు చేర్చారు. డౌన్‌లైన్‌లో ఓవర్‌హెడ్ వైర్లు సవరణ కొనసాగుతుంది. ఈ మార్గంలో రైలు రవాణా ప్రభావితమైంది. భద్రతాపరమైన తనిఖీలు చేపట్టిన తర్వాత వందేభారత్ రైలు డీజిల్ ఇంజిన్ లేకుండా స్వతహాగా బయల్దేరుతుంది.

నేడు సేవలు రద్దు

భువనేశ్వర్: హౌరా-పూరీ మధ్య ఉభయ దిశల్లో సోమవారం 22895/22896 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను రద్దు చేశారు. తూర్పుకోస్తా రైల్వే ఈ మేరకు సమాచారం అందజేసింది. ఆదివారం సంభవించిన దుర్ఘటనతో ప్రభావిత రైలు గమ్యం ఆలస్యంగా చేరడంతో ఈనెల 22న సేవలు రద్దు చేయడం అనివార్యమైనట్లు ఈ వర్గాలు వివరించాయి.



నిలిచిన రైలు వద్ద గుమిగూడిన స్థానికులు



వంతెన మధ్య భాగంలో నిలిచిపోయిన రైలు

అడవి ఉడత స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న అడవి ఉడత

- బంధించిన దాబా యజమానిపై కేసు నమోదు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహానా సమితి లుహాగుడిలో దాబా(హోటల్)పై అటవీశాఖ అధికారులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా అరుదైన ఇండియన్ అడవి ఉడత(ఇండియన్ జెయింట్ స్క్విరల్)ను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. లుహాగుడిలో దాబా యజమాని అడవి ఉడుతను కొద్దినెలల క్రితం బంధించి, బోనులో పెంచుతున్నాడు. అటవీ వన్యప్రాణుల చట్టం-1972 షెడ్యూల్ 1 ప్రకారం వన్యప్రాణులను బంధించడం నేరం. ఈ నేపథ్యంలో జిల్లా అటవీశాఖ అధికారి సుబ్రహ్మణ్య ఆనంద్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కన్జర్వేటర్ అశోక్ బెహరా, చంద్రగిరి ఫారెస్ట్ అధికారులు దాబాపై దాడి చేసి, యజమానిపై కేసు నమోదు చేశారు. వన్యప్రాణిని స్వాధీనం చేసుకొని, చంద్రగిరి బీట్ కార్యాలయానికి తరలించారు. దీనికి ఎక్కడి నుంచి తీసుకువచ్చారో విచారిస్తున్నారు.

డిమాండ్లు పరిష్కరించకుంటే.. ఆందోళనే

- రాష్ట్ర అమలామంచ్ ఛైర్మన్ అరుణ్ పాఢి



ప్రసంగిస్తున్న అరుణ్‌కుమార్ పాఢి, వేదికపై గోపీనాథ్, మనోజ్



సమావేశంలో పాల్గొన్న అమలా సంఘం సభ్యులు

రాయగడ: గత కొన్నాళ్లుగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని రాష్ట్ర అమలామంచ్ రాష్ట్రశాఖ ఛైర్మన్ అరుణ్‌కుమార్ పాఢి విమర్శించారు. స్థానిక న్యూ కాలనీలో ఉన్న అమలామంచ్ రాయగడ శాఖ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల గ్రేడ్‌పే 4వ స్థాయి నుంచి 9వ స్థాయికి పెంచాలని డిమాండ్ చేశారు. ఉన్న డిమాండ్లలో కనీసం ఈ ప్రధాన డిమాండ్‌కు ప్రభుత్వం తప్పనిసరిగా ఆమోదించాలని కోరారు. ఇదే విషయమై ఏప్రిల్ 21న అల్టిమేటం ఇచ్చామని గుర్తుచేశారు. అయినా సరైన స్పందన రాకపోవడంతో జూన్ 1నుంచి నల రిబ్బన్ ధరించి నిరసనలు తెలియజేయడంతో పాటు జిల్లాలోని 400మంది ఉద్యోగులతో ఆందోళన, ర్యాలీలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా తమ ఆందోళన విస్తరిస్తామని వివరిచారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మనోజ్ రథ్, జిల్లా కార్యదర్శి గోపినాథ్ రౌత్ తదితరులు పాల్గొన్నారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న వాకర్స్ సభ్యులు

రాయగడ: ప్రతి వ్యక్తికీ తన దైనదిన జీవితంలో నడక ఎంతో అవసరమని, దీనితో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జంఝావతి మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సుస్మిత దాస్ అన్నారు. నడకపై ప్రజా చైతన్యం కలిగించేందుకు క్లబ్ సభ్యులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రేమ్‌పహాడ్ నుంచి ప్రారంభించిన ర్యాలీ.. మెయిన్ రోడ్డు మీదుగా సాగింది. పట్టణానికి చెందిన అన్ని వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మజ్జిగౌరి మందిరం వద్ద మహిళలు అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం మజ్జిగ పంపిణీ చేశారు.

ఎయిడ్స్‌తో మరణించిన వారికి నివాళి



ఎయిడ్స్ బాధిత మృతులకు నివాళులర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఆదివారం ఎయిడ్స్ బాధిత మృతులకు నివాళులర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అగ్గున మేఘన, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డబ్బీరు భవానీ శంకర్‌ల ఆధ్వర్యంలో వైద్యులు, నర్సులు, వివిధ విభాగాలకు చెందిన సిబ్బందితో కలిసి కొవ్వొత్తులను పట్టుకుని నివాళులర్పించారు.

వివాహిత ఆత్మహత్య

పోలాకి: మండలంలోని పిరువాడ గ్రామానికి చెందిన ఉర్జాన ఢిల్లీశ్వరి అనే వివాహిత ఆదివారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోటబొమ్మాళి మండలం సంతనేరడివలస గ్రామానికి చెందిన ఢిల్లీశ్వరి, పిరువాడకు చెందిన ఎన్ని రమేష్‌లు ప్రేమించుకుని పెద్దలు ఒప్పుకున్నాక ఏడాదిన్నర కిందట పెళ్లి చేసుకున్నారు. వీరికి నాలుగు నెలల పాప కూడా ఉంది. రమేష్ సీలింగ్ పనులు చేస్తుంటారు. ప్రేమ వివాహం కావడంతో కట్నకానుకల ప్రస్తావన రాలేదు. కానీ పెళ్లయ్యాక రమేష్ నిత్యం కట్నం కోసం వేధించేవాడు. చెడు అలవాట్లు కూడా ఉండడంతో ఢిల్లీశ్వరి తన బంధువుల వద్ద అనేక మార్లు తన బాధలు చెప్పుకుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నర్సింహమూర్తి కేసు నమోదు చేశారు. డీఎస్పీ బాలచంద్రారెడ్డి పిరువాడ చేరుకుని దర్యాప్తు అనంతరం మృతదేహాన్ని నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

రైలు కింద పడి టీచర్ దుర్మరణం



రైలు కింద పడి మృతి చెందిన బొంగు భరత్

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం నరసన్నపేట మండలం తామరాపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బొంగు భరత్(39) రైలు కింద పడి మృతి చెందారు. ఆయన ప్రస్తుతం కోటబొమ్మాళి మండలం తాటిపర్తి గ్రామంలో టీచర్‌గా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాకుళంలో నివాసం ఉంటున్నారు. మృతునికి భార్య భావని, కుమారులు దీక్షిత్, చేతన్‌శౌర్య ఉన్నారు. భరత్ మృతితో స్వగ్రామం తామరాపల్లిలో విషాద ఛాయలు నెలకొన్నాయి. పలాస జీఆర్పీ ఎస్‌ఐ షరీఫ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఒక్క సబ్జెక్టు డిగ్రీ కోర్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ఎచ్చెర్ల క్యాంపస్: నూతన విద్యా విధానం అమలు, ఉన్నత విద్యా మండలి సూచనల మేరకు ఈ విద్యా సంవత్సరం నుంచి ఒక్క సబ్జెక్టు డిగ్రీ మూడేళ్ల కోర్సు లు ప్రారంభించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రా జేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీలో ఆదివారం వివరాలు వెల్లడించారు. ఎంపిక చేసిన కళాశాలల్లో ఈ కోర్సు నిర్వహణ ఉంటుందని చెప్పారు. మూడేళ్ల డిగ్రీలో ఆరు సెమిస్టర్లతో 21 పేపర్లు ఒక్క ప్రత్యేక సబ్జెక్టువి ఉంటా యని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో విద్యావిభాగంలో 21 పేపర్లతో కూడి న మూడేళ్ల డిగ్రీ ప్రారంభంపై కసరత్తు చేస్తున్నట్లు వివరించారు. బీఏ ఎడ్యుకేషన్‌గా కోర్సు నిర్వహిస్తామని అన్నారు. 2019-20 బ్యాచ్‌కు నాలుగేళ్ల డిగ్రీ కోర్సులో భాగంగా ఎంపిక చేసిన సబ్జెక్టులో కొన్ని కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తామని, ఈ విద్యార్థులు పీజీలో నేరుగా రెండో ఏడాది ప్రవేశాలు పొందే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది నుంచి నూతన విద్యా విధానంలో భాగంగా వర్సిటీలో బీఏ ప్లస్ బీఎడ్, బీఎస్సీ ప్లస్ బీఎడ్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఉపాధి లక్ష్యంతో డిగ్రీ కోర్సుల్లో మార్పులు చేస్తున్నట్లు వివరించారు.

కబడ్డీ పోటీల్లో సిక్కోలు సత్తా



తృతీయ స్థానం దక్కించుకున్న శ్రీకాకుళం జట్టు

విజయనగరం: రాష్ట్ర స్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జట్టు ప్రతిభ చూపింది. విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీల్లో బాలుర విభాగంలో కృష్ణా జిల్లా జట్టు ద్వితీయ స్థానం, శ్రీకాకుళం జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో కృష్ణా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా... ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం జట్టు, తృతీయ స్థానంలో ఆతిథ్య విజయనగరం జట్టు నిలిచాయి. విజేత జట్లకు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్‌కౌశిక్ తదితరులు బహుమతులు ప్రదానం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రి గేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ వి.సందీప్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మతిస్థిమితం లేని సుమారు 38 ఏళ్ల వ్యక్తి మూడు నెలలుగా నగరంలోనే భిక్షాటన చేస్తూ తిరిగేవాడు. ఒడియా భాష మాట్లాడేవాడు. కాలికి సెప్టిక్ కావడంతో స్థానికులు 15 రోజుల కిందట రిమ్స్‌లో చేర్పించారు. అయితే అతను వైద్యం చేయించుకోకుండా బయట తిరిగేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం డీహైడ్రేషన్‌కు గురై మృతి చెందినట్లు రిమ్స్ సెక్యూరిటీ ఇన్‌చార్జి ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మందస ఉత్సవాల్లో జానపద పోటీలు



మాట్లాడుతున్న ఉత్సవాల కమిటీ నాయకులు

మందస: మేజరు పంచాయతీ మందసలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న శ్రీఅన్నపూర్ణమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి జానపద పోటీలు నిర్వహించనున్నారు. మహేంద్ర కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ గిన్ని అప్పలస్వామిరెడ్డి జ్ఞాపకార్థం ఈ నెల 29, 30వ తేదీల్లో జానప కెరటాలు అనే కార్యక్రమాలను జరుపుతున్నట్టు మహేంద్ర కళామండలి, స్పందన సాహితీ, సంస్కృతి వేదిక, గ్రామదేవత ఉత్సవాల కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని కళింగ వైశ్య సంఘం భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనడానికి 9440321034, 9000331343 అనే నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ చెరుకుపల్లి యల్లమ్మ, లక్ష్మణమూర్తి, గిన్ని తిరుపతి రెడ్డి, వీవీ రమణమూర్తి, మాజీ సర్పంచ్ డుంకురు తిరుపతి, తెలుకుల గణేశ్, వడ్డి గోపాలకృష్ణ, ఆర్. దిలీప్‌కుమార్, ఇప్పిలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాడంగిలో గాలివాన



డొంకినవలస వద్ద చెట్టుకొమ్మ పడడంతో తెగిపోయిన విద్యుత్ వైర్లు

బాడంగి: మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన గాలివానతో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. డొంకినవలస నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మట్టిరోడ్డు పక్కనగల 11 కేవీ వైర్లపై చెట్టుకొమ్మ పడడంతో తెగిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు తమ సిబ్బందితో చేరుకొని రైల్వేకు చెందిన క్రేన్‌తో చెట్టుకొమ్మను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఆకులకట్ట, రామచంద్రాపురం, కోడూరు, బ్రహ్మన్నవలస, రావివలస, కోటిపల్లి తదితర గ్రామాల్లోని మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. గాలుల ధాటికి మామిడి కాయలు రాలిపోయాయి. పినపెంకి, ఆనవరం, పాల్తేరు, గొల్లాది తదితర గ్రామాల్లోని అరటితోటలను నేలమట్టమయ్యాయి.

హెచ్ఐవీ రోగుల మరణాల శాతాన్ని తగ్గించాలి

- జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ రామేశ్వరి ప్రభు



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఎయిడ్స్ నియంత్రణ శాఖ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ రోగుల మరణాల శాతాన్ని తగ్గించాలని జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ రామేశ్వరిప్రభు అన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ విజయనగరం ఆర్అండ్‌బీ నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వరకు ఆదివారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం బాలాజీ, డాక్టర్ జగదీష్, పద్మ, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

అందిన ద్రాక్ష తీయన..



ద్రాక్ష మొక్కకు గుత్తులుగా కాసిన పండ్లు

సీతంపేట: సీతంపేట మెయిన్‌రోడ్డు పక్కన నివసిస్తున్న ఆర్టీసీ కండక్టర్ మూర జాన్ ఇంటి మేడపై వేసిన ద్రాక్ష మొక్కకు కాపువచ్చింది. నల్ల ద్రాక్ష గుత్తుగుత్తులుగా కాపురావడంతో జాన్ సంతోషపడుతున్నారు. రుచిగా ఉన్నాయని చెబుతున్నారు. సీతంపేట వాతావరణం ద్రాక్షపంటకు అనువైనదని, దీనిపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు.

జూన్ 4న తోటపల్లిలో మహాభిషేకం



వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుంటున్న హరేకృష్ణ ప్రతినిధులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి, శ్రీకోదండరామాలయంను హరేకృష్ణ సంస్థ ప్రతినిధులు ఆదివారం సందర్శించారు. వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నాగావళి నదీ తీరాన్ని హరేకృష్ణ, అక్షయపాత్ర సంస్థకు చెందిన నిష్కించన భక్తదాస్, యదురాజదాస్, శృతిసాగర్ దాస్, జితామిత్ర దాస్, భక్తవంశీ, తిలారు శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు. హరికృష్ణ సంస్థ ఆధ్వర్యంలో శ్రీనితాయి, గౌరంగలకు (శ్రీకృష్ణ, బలరాం) దేవస్థానంలో జేష్ట పూర్ణిమనాడు (జూన్4న) మహాభిషేకాన్ని నిర్వహిస్తామని ఈఈ బి.ఎల్.నగేష్ తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే పవిత్ర కార్యక్రమంలో భక్తులు అధికంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు, దాతలు, కమిటీ సభ్యులు పాల్గొనాలని కోరారు.

వెంకటరాజపురంలో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం గ్రామంలో ఏనుగులగుంపు సంచరిస్తోంది. పొలాల్లోని వరిధాన్యం, జొన్నలను శనివారం రాత్రి చిందరవందర చేశాయి. ఆదివారం ఉదయం గుమ్మిడిగెడ్డ వాగులోకి చేరుకున్న ఏనుగు లు సాయంత్రం గ్రామంలోని వీధుల్లోకి రావడంతో జనం భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి వెంటనే తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

ఇంటిముంగిటకే వైద్యం

వైద్యో నారాయణో హరి.. వైద్యం చేసేవారిని దేవుడితో సమానంగా చూస్తాం. అటువంటి దేవుళ్లు ఇప్పుడు ప్రతినెలా రెండుసార్లు పల్లెలను సందర్శిస్తున్నారు. వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారిని పరీక్షిస్తున్నారు. జబ్బునయమయ్యేలా ఉచితంగా మందులు అందజేస్తున్నారు. అవసరమైనవారిని పెద్దాస్పత్రులకు రిఫర్ చేసి ప్రాథమిక దశలోనే వ్యాధిని నయంచేస్తున్నారు. మంచంపై లేవలేనివారి ఇళ్లకు వెళ్లి సేవలు అందిస్తున్నారు. గొప్ప దార్శనికత, దూరదృష్టితో గతేడాది అక్టోబరులో ప్రారంభించిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ఇప్పుడు అద్భుత ఫలితాలను ఇస్తోంది. కొద్దినెలల్లోనే విజయనగరం జిల్లాలో సుమారు 2 లక్షల మందికి, పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక లక్షా 81 వేల మందికి వైద్యసేవలు అందాయి. ఫ్యామిలీ డాక్టర్ సేవలపై 'సాక్షి' అక్షర రూపం.

- ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్యరంగంలో సరికొత్త విప్లవం
- మారుమూల గ్రామాలకూ ఫ్యామిలీ డాక్టర్ సేవలు
- నెలలో రెండుసార్లు వైద్యుడు, వైద్య సిబ్బంది సందర్శన
- పెద్దాస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయించుకొని వచ్చినవారికీ చెకప్‌లు
- ఉచితంగా మందులు అందజేత
- ప్రజలకు ఆరోగ్య భరోసా



చిత్రంలో మంచంపై ఉన్న రోగి పేరు ముగడ చింతయ్య. సంతకవిటి మండలంలోని పుల్లిట గ్రామం. పక్షవాతంతో పదేళ్లుగా మంచం పట్టాడు. వైద్యసేవలకు తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యుడు కె.వెంకటేశ్వరరావు వారి ఇంటికి నెలకు రెండుసార్లు వస్తున్నారు. వైద్యపరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారు. దీంతో చింతయ్య కుటుంబీకుల ఆనందానికి అవధులులేవు. ఫ్యామిలీ డాక్టర్ వైద్యం తన భర్తను బతికిస్తోందని అతని భార్య ఆదమ్మ వెల్లడించారు.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టరు విధానానికి రూపకల్పన చేసింది. గత ఏడాది ఆగస్టు 15న ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. అక్టోబరు 21 నుంచి ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి గ్రామాన్ని సంబంధిత పీహెచ్‌సీ వైద్యాధికారి, వైద్య బందం 104 వాహనాల్లో రెండుసార్లు సందర్శిస్తున్నారు. స్థానికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో రోగులను పరీక్షించి, అవసరమైనవారికి అక్కడే ఉచితంగా మందులను అందజేస్తున్నారు. దీంతో రోగులు వైద్యం కోసం ఒకప్పటిలా ఎన్నో వ్యయప్రయాసల కోర్చి వైజాగ్, విజయనగరంలోని కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవస్థలు తొలగిపోయాయి. ఇంటిముంగిటే వైద్యం అందుతోంది. ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రారంభమైన దగ్గరనుంచి ఇప్పటివరకు విజయనగరం జిల్లాలో 2,06,916 మందికి వైద్యసేవలను అందించారు. అవసరమైన వారికి 14 రకాల పరీక్షలను అక్కడే నిర్వహిస్తున్నారు. దాదాపు 74 రకాల మందులను ఉచితంగా అందజేస్తున్నారు. బీపీ, సుగర్ లాంటి జీవనశైలి వ్యాధుల బారిన పడ్డ వారికి నెలకి సరిపడా మందులను అందిస్తున్నారు.

పల్లెబాటలో ఫ్యామిలీ డాక్టర్లు...

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద గ్రామాల్లోకి వెళ్లిన వైద్యులు ఉదయం పూట సాధారణ రోగులకు వైద్యం చేస్తున్నారు. మధ్యాహ్నం నుంచి మంచాలకే పరిమితమైన, కదల్లేని రోగులు, వృద్ధులకు ఇళ్లకు వెళ్లి పరీక్షిస్తున్నారు. హాస్టళ్లు, పాఠశాలలు, అంగనవాడీ కేంద్రాలను సందర్శించి పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సేవలకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఫ్యామిలీ డాక్టర్లను నియమించింది. మరోవైపు బీఎస్సీ ఉత్తీర్ణులైన 482 మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లలో సేవలందిస్తున్నారు.

కదిలే వైద్యాలయాలు...

ప్రస్తుతం ప్రభుత్వం అందించిన 104 వాహనాలను చూస్తే కదిలే వైద్యాలయాలుగా ప్రజలు భావిస్తున్నారు. అన్ని రకాల వైద్య పరికరాలు, మందులతో సిద్ధమైన అలాంటి వాహనాలు విజయనగరం జిల్లాలో 47, పార్వతీపురం మన్యం జిల్లాలో 19 అందుబాటులో ఉన్నాయి. ఈ వాహనాల్లో గ్రామాలకు వైద్యులు, వైద్య సిబ్బంది వెళ్లి 20 రకాల వైద్య సేవలను అందిస్తున్నారు. ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 13 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను అనుసంధానం చేశారు. ప్రతీ పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున డాక్టర్లను నియమించారు. వారిలో ఒక డాక్టర్ పీహెచ్‌సీలో అందుబాటులో ఉంటే, మరొకరు 104 వాహనంలో గ్రామాలకు వెళ్లి సేవలందిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైద్యారోగ్య శాఖల్లోని ఖాళీలను భర్తీ చేసిన ప్రభుత్వం వైద్య రంగాన్ని పరిపుష్టం చేసింది. సాధారణ ఆరోగ్య తనిఖీలతోపాటు ఈసీజీ లాంటి అత్యవసర పరీక్షలను కూడా ఈ వాహనాల్లో నిర్వహిస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ ఆరోగ్యసమాచారం

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో 14 రకాల డయాగ్నోస్టిక్ ర్యాపిడ్ కిట్స్, 74 రకాల మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతీఒక్కరికీ వారి ఇంటి వద్ద వైద్యపరీక్షలు జరిపి, వారి ఆరోగ్య సమాచారాన్ని డిజిటలైజ్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా ప్రతి పౌరుడి ఆరోగ్య వివరాలను, వారి అనుమతితో డిజిటలైజ్ చేస్తున్నారు. ప్రతి పౌరుడికి ఒక డిజిటల్ హెల్త్ ఐడీ నంబర్‌ను కేటాయిస్తున్నారు. దీనిని ఫ్యామిలీ డాక్టర్ విధానంతో అనుసంధానం చేస్తారు. భవిష్యత్‌లో ఆరోగ్యశ్రీ, ఎన్‌సీడీ స్క్రీనింగ్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ఏకీకృతం చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు మీసాల నాగేశ్వరరావు. ఇతనిది డెంకాడ మండలం పినతాడివాడ గ్రామం. ఐదేళ్ల కిందట పక్షవాతం బారిన పడ్డారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం రాక ముందు విజయనగరంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లి తనిఖీలు చేయించుకునేవారు. గత 7 నెలలుగా అతని ఇంటికి వచ్చి వైద్యుడు వైద్యపరీక్షలు చేస్తున్నారు. అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో వ్యయప్రయాసలు తప్పాయని, ఆరోగ్యం కుదుటపడుతోందంటూ నాగేశ్వరావు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యుల షెడ్యూల్‌ను ముందే ప్రకటిస్తున్నాం



ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా వైద్యులు గ్రామాల్లోకి వెళ్లే షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటిస్తున్నాం. దీనివల్ల ఆయా గ్రామాల ప్రజలకు ముందస్తు సమాచారం ఉంటుంది. ఫలితంగా అవసరమైన వారంతా ఈ సేవలను వినియోగించుకొనేందుకు వీలు అవుతుంది. ఒక వేళ ఎక్కడైనా ఒక డాక్టర్ సెలవు పెడితే, అక్కడ సేవలు ఆగిపోకుండా కొంతమంది వైద్యులను రిజర్వులో ఉంచి, నిరంతరాయంగా సేవలను అందించేందుకు చర్యలు తీసుకున్నాం. గ్రామీణ ప్రజలంతా తమ ఊరిలోకే వచ్చి ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– నాగలక్ష్మి, విజయనగరం జిల్లా కలెక్టర్

గ్రామాల్లోనే వైద్యాలయాలు...



సామాన్యులకు విద్య, వైద్యం అందుబాటులో ఉంచడమే ప్రధాన కర్తవ్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భావిస్తోంది. ప్రాథమిక వైద్య సేవల విస్తరణలో భాగంగా ప్రతి 2వేల మందికి ఒకటి చొప్పున వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. విజయనగరం జిల్లాలో 482, పార్వతీపురం మన్యం జిల్లాలో 281 సాకారమయ్యాయి. వాటిలో ఒక ఏఎన్‌ఎం, ఒక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ), ఒక మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎమ్ఎల్‌హెచ్‌పీ), ఒక ఆశ వర్కర్ చొప్పున అన్ని క్లినిక్‌ల్లో ప్రభుత్వం నియమించింది. ఇక్కడ అన్ని రకాల వైద్య సేవలు, వైద్యపరీక్షల కిట్లు, మందులు అందుబాటులో ఉంటున్నాయి. గ్రామ స్థాయిలో నయం కాని ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని పీహెచ్‌సీకి, మరీ తీవ్రంగా ఉంటే సీహెచ్‌సీ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. చిన్న పిల్లలు, గర్భిణులకు కూడా స్థానికంగానే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ విలేజ్ క్లినిక్‌లకు టెలీ మెడిసిన్, టెలీ హబ్‌ల ద్వారా మెడికల్ ఆఫీసర్‌తో పాటు ప్రత్యేక సర్వీసులు కూడా త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

ఫ్యామిలీ డాక్టర్ నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు...
ఈసీజీ
హిమోగ్లోబిన్
గర్భ నిర్ధారణకు యూరిన్ టెస్ట్
ర్యాండమ్ గ్లూకోజ్ టెస్ట్ (షుగర్)
మలేరియా టెస్ట్
హెచ్ఐవీ టెస్ట్
డెంగీ టెస్ట్
మల్టీపారా యూరిన్ స్ట్రిప్స్
ఆయోడిన్ టెస్ట్
వాటర్ టెస్టింగ్
హెపటైటిస్ బి పరీక్ష
ఫైలేరియాసిస్ పరీక్ష
సిఫ్లిస్ ర్యాపిడ్ టెస్ట్
విజువల్ ఇన్స్‌పెక్షన్
స్పూటమ్ కల్చర్

'ఫ్యామిలీ డాక్టరు' సేవలిలా...

అంశం	విజయనగరం జిల్లా	పార్వతీపురం మన్యం జిల్లా
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	482	281
వైద్యులు పరీక్షించిన వారి సంఖ్య	2,06,916	1,81,325
జనరల్ ఓపీ	1,30,872	99,333
కౌమార బాలికలు	95	109
ఏఎన్‌సీ (బాలింతలు)	11,730	16,811
పీఎన్‌సీ (గర్భిణులు)	5934	
అనీమియా బాధితులు	1281	3,433
బీపీ బాధితులు	27,423	33,548
మధుమేహ వ్యాధిగ్రస్తులు	15,607	15,597
బీపీ, సుగర్ బాధితులు	12,478	4,753
నోటి కేన్సర్	289	387
రొమ్ము కేన్సర్	245	90
గర్భాశయ కేన్సర్	861	480
టీబీ వ్యాధిగ్రస్తులు	101	7

ఊపిరి పోశారు



డిగ్రీ పూర్తిచేసిన నేను 25 ఏళ్ల వయస్సులో ఊపిరితిత్తుల వ్యాధికి గురయ్యాను. ఊపిరి తిత్తుల్లో ఆరు రంధ్రాలు పడడంతో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద మార్చి 6 తేదీన వైజాగ్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స చేశారు. దీనికోసం ప్రభుత్వం రూ.3 లక్షలు ఖర్చు చేసింది. దాతలు మరో రూ.2లక్షలు ఆర్థిక సాయం చేశారు. ప్రస్తుతం వలంటీరుగా పనిచేస్తూ భార్య,పిల్లలను పోషిస్తున్నా. ప్రతి నెలా ఫ్యామిలీ డాక్టర్ సేవలు పొందుతున్నాను.

– రెడ్డి విజయ్, వేపాడ

బీచ్‌ల పరిశుభ్రతతో పర్యాటక అభివృద్ధి

- చింతపల్లి తీరంలో వ్యర్థాల తొలగింపు
- పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి



చింతపల్లి బీచ్‌లో వ్యర్థాలను తొలిగిస్తున్న కలెక్టర్

పూసపాటిరేగ: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. కేంద్ర ప్రభుత్వం మిషన్‌లైఫ్ కార్యక్రమంలో భాగంగా బీచ్‌ల పరిశుభ్రత కోసం చేపట్టిన స్వచ్ఛతా జన్ భాగీదారి–సాగర తీర స్వచ్ఛత కార్యక్రమాన్ని చింతపల్లి తీరంలో ఆదివారం నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, వివిధ పరిశ్రమలకు చెందిన ఉద్యోగులతో కలిసి తీరంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ముందుగా జీ20 మెగాబీచ్ క్లీన్ అఫ్ క్యాంపెయిన్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కాలుష్యం, వ్యర్థాల నుంచి సముద్రాలను రక్షించుకుంటామని, సముద్ర జీవులకు ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని, భూమిపై జీవించే సమస్త జీవరాశికి స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన సముద్రం ముఖ్యమని, స్థిరమైన, పర్యావరణ అనుకూలమైన జీవనశైలిని అవలంబిస్తామంటూ కలెక్టర్‌తో పాటు ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ పరిరక్షణపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. చింతపల్లి బీచ్‌లో ఫిషింగ్‌జెట్టీ నిర్మిస్తున్నందున ఆ ప్రాంతంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టినట్టు కలెక్టర్ వెల్లడించారు. తీరం పరిశుభ్రంగా ఉంటే పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

పర్యావరణ అనుకూల ఉత్పత్తుల పరిశీలన

విజయనగరానికి చెందిన ఎంపీ పాలిమర్స్, మహేష్ ప్రొడక్ట్స్ సంస్థలు పర్యావరణ అనుకూలమైన పదార్థాలతో తయారు చేసిన ప్లేట్‌లు, గ్లాసులు, క్యారీబ్యాగుల స్టాల్‌ను కలెక్టర్ పరిశీలించారు. చెరకు పిప్పిని ఉపయోగించి ఈ వస్తువులు తయారు చేసినట్టు పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. స్టాల్స్ పరిశీలనలో ఎస్ఎంఎస్ ఫార్మాస్యుటికల్స్, హెచ్‌బీఎల్, మైలాన్, స్టీల్ ఎక్స్చేంజ్ ఇండియా, ఐఐడీ ప్యారీ, మా మహామాయ పరిశ్రమ ప్రతినిధులు, మెరైన్ పోలీసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాలుష్యనియంత్రణ మండలి అధికారి టి.సుదర్శనం, మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఎంపీడీఓ జి.రామారావు, జిల్లామత్స్యకార సంఘం అధ్యక్షుడు బర్రి చినఅప్పన్న, మెరైన్ సీఐ వైకుంఠరావు, సర్పంచ్ బర్రి ముసలి, ఎంపీటీసీ మైలపల్లి తాత తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిబీచ్‌లో వాక్‌థాన్ నిర్వహిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు

యువకుడిపై హత్యాయత్నం..!

రేగిడి: ప్రశాంత వాతావరణం కలిగిన మండలంలో ఓ యువకుడిపై జరిగిన హత్యాయత్నం ఘటన కలకలం రేపింది. సంకిలి గ్రామం వద్ద ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన కర్రి రమణపై సంకిలి సుగర్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న పాలకొండకు చెందిన లక్ష్మీనారాయణ కత్తితో దాడికి పాల్పడ్డాడు. లక్ష్మీరనారాయణ పాలకొండ తిరుమల కనస్ట్రక్షన్స్ సూపర్‌వైజర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. తిరుమల కనస్ట్రక్షన్‌కు బాధితుడు రమణ మెటీరియల్ అద్దెకు ఇచ్చేవాడు. ఈ నేపథ్యంలో రమణకు ఇవ్వాల్సిన రూ.4.75 లక్షలు నగదు తిరుమల కనస్ట్రక్షన్ కొంతకాలంగా ఇవ్వడంలేదు. ఈఅద్దె ఇవ్వాల్సిందేనని రమణ ప్రతి రోజూ సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి వచ్చే తిరుమల కనస్ట్రక్షన్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణను డిమాండ్ చేస్తున్నాడు. దీంతో వీరిద్దరి మధ్య కొద్దిరోజులుగా రోజూ వివాదం జరుగుతోంది. చివరికి లక్ష్మీనారాయణ ఆవేశం ఆపుకోలేక తనతో తీసుకొచ్చిన చాకుతో రమణపై మెడతో పాటు గొంతుపై కత్తితో పొడవగా తీవ్రగాయాలపాలయ్యాడు. రక్తపుమడుగులో కొట్టుమిట్టాడుతున్న రమణను వదిలేసి లక్ష్మీనారాయణ అక్కడినుంచి పరారయ్యాడు. స్థానికులు వెంటనే స్పందించి రమణను 108 వాహనం ద్వారా రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు రాజాం ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

అదరగొట్టిన ఆతిథ్య జిల్లా జట్లు

- అండర్–19 కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన విజయనగరం జట్లు
- బాలుర విభాగంలో ప్రథమ స్థానం... బాలికల విభాగంలో తృతీయ స్థానం
- ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



బాలుర విభాగంలో ప్రథమ స్థానం దక్కించుకున్న విజయనగరం జట్టు



బాలికల విభాగంలో తృతీయ స్థానం దక్కించుకున్న ఆతిథ్య విజయనగరం జట్టు

విజయనగరం: రాష్ట్ర స్థాయి అండర్–19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో ఆతిథ్య విజయనగరం జట్లు సత్తాచూపాయి. బాలుర విభాగంలో విజయనగరం జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకోగా.. బాలికల జట్టు తతీయ స్థానం దక్కించుకుంది. విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీల్లో బాలుర విభాగంలో కృష్ణా జిల్లా జట్టు (ద్వితీయ), శ్రీకాకుళం జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో కృష్ణా జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా... ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, తృతీయ స్థానంలో ఆతిథ్య విజయనగరం జట్టు నిలిచాయి. విజేత జట్లకు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్‌కౌశిక్ తదితరులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో రాణించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్తా చాటాలని ఆకాంక్షించారు. విజయనగరంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. విజయనగరం జిల్లా క్రీడలకు, కళా రంగానికి పుట్టినిల్లుగా పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులను ప్రోత్సహించడంలో జిల్లా అసోసియేషన్ మంచి సేవలందిస్తుందని హామీ ఇచ్చారు. జిల్లాలో ఏ క్రీడా పోటీలు జరిగినా వ్యాయామ ఉపాధ్యాయుల చేస్తున్న కృషిని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడా రంగాన్ని ప్రోత్సహించి పారితోషికాలు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో డీవీఈఓ సురేష్ బాబు, టోర్నమెంట్ పరిశీలకుడు జయరాజ్, అండర్–19 స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎల్.వి.రమణ, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, పార్వతీపురం మన్యం జిల్లా చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు, బొమ్మాన రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యారావు, తౌడుబాబు, కె.ఎ.బాలకష్ణ, ఏపీ పోలీస్ టీమ్ కోచ్ పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరింత రుచిగా.. నాణ్యంగా..



ఆస్పత్రిలో రోగులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

సీతంపేట: ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఇచ్చే ఉచిత భోజనం(డైట్) ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ఇంతవరకు రూ.40గా ఉన్న రోజువారీ ఖర్చును ఇప్పుడు ఏకంగా రూ.80 నుంచి రూ.100 చేసింది. దీంతో రోగులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించేందుకు మార్గం సుగమమైంది. ప్రతిరోజూ ఆస్పత్రిలోని గర్భిణులు, బాలింతలు, రోగులకు ఉదయం టిఫిన్, రెండు పూటలా భోజనం పెట్టేవారు. దీనికోసం ప్రభుత్వం రూ.40 చెల్లించేది. ఆ మొత్తం సరిపోవడం లేదని ప్రభుత్వానికి వినతులు వచ్చిన నేపథ్యంలో ఆ భోజనం ఖర్చును రెట్టింపు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇదేకాకుండా రోగికి సహాయంగా వచ్చిన వారికి కూడా భోజనం వసతి కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

గతంలో ఇంటి నుంచి భోజనం..

గతంలో ఏ ప్రభుత్వాలూ ఆస్పత్రుల్లోని రోగులకు అందించే ఆహారం(డైట్)పై అంతగా దృష్టిసారించలేదు. నామమాత్రంగానే వారికి భోజనానికి అయ్యే ఖర్చులు చెల్లించేవారు. దీంతో అంతగా నాణ్యత లేని ఆహారం వారికి అందేది. కొంతమంది రోగులు అయితే ఈ ఆహారం మానేసి, దగ్గరలోని తమ బంధువుల ఇంటి వద్ద నుంచి భోజనం తెప్పించుకునే పరిస్థితి ఉండేది. ఆ సౌకర్యం కూడా లేని వారైతే ఆస్పత్రిలో ఇచ్చే భోజనమే మహాప్రసాదంగా భావించేవారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోగులు, రోగి సహాయకులకు కూడా పౌష్టికాహారం ఇచ్చేందుకు డైట్ చార్జీలు పెంచడాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు. రోజుకు మూడు పూటలా చక్కనైన ఆహారం అందుతుండడంతో రోగులు కూడా సంతోషిస్తున్నారు.

మెనూ వివరాలిలా..

ఉదయం: గోధుమ రవ్వ ఉప్మా, టమాటా బాత్, బ్రెడ్(వీటిలో ఏదో ఒకటి), అదనంగా 100 మిల్లీలీటర్ల పాలు

మధ్యాహ్నం: అన్నం, కూర, సాంబారు, మజ్జిగ, ఉడకబెట్టిన గుడ్డు, అరటి పండు

సాయంత్రం: అన్నం, కూర, సాంబారు, మజ్జిగ, ఉడకబెట్టిన గుడ్డు, అరటి పండు గర్భిణులు, బాలింతలకు అన్నం, ఆకుకూర పప్పు, గుజ్జు కూర, సాంబారు, మజ్జిగ, ఉడకబెట్టిన గుడ్డు, అరటిపండు, వేరుశనగ పట్టీ, జామకాయ, రాగిజావ

నిరంతర పర్యవేక్షణ..

కొత్త మెనూ చార్జీల ప్రకారం ఆస్పత్రిలోని రోగులకు భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయంపై అధికారులతో నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నారు. కిచెన్ రూమ్‌లో తయారీ దగ్గర నుంచి రోగుల వద్దకు వచ్చే ఆ ఆహారం వచ్చే వరకు నాణ్యత, తనిఖీలు, రికార్డుల నిర్వహణ ఉంటుంది. కూరలో ఉప్పు తక్కువైనా, ఎక్కువైనా, అరటిపండ్లు కుళ్లిపోయినా వాటి వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తారు. రోగికి సక్రమంగా ఆహారం అందిస్తున్నారా లేదా అని కూడా గమనిస్తారు.